క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న డీపీవో

సారంగాపూర్:ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు నిర్మాణాన్ని ప్రారంభించాలని డీపీవో మదన్‌మోహన్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని, పనులు ఆగకుండా సెర్ప్ ద్వారా రూ.లక్ష వరకు రుణం అందిస్తున్నామని పేర్కొన్నారు. తహసీల్దార్ వహీదొద్దీన్, ఎంపీడీవో గంగాధర్, హౌజింగ్ డీఈ భాస్కర్, ఎంపీవో సలీం ఉన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ అర్చన

కథలాపూర్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజారోగ్యంపై వైద్యసిబ్బంది దృష్టిసారించాలని వైద్యశాఖ జిల్లా పోగ్రామింగ్ ఆఫీసర్ అర్చన అన్నారు. మంగళవారం కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ల్యాబ్, ఫార్మసీ గదులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్యం అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వైద్యసిబ్బంది పర్యటించి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

పంచాయతీల పురోగతిపై అధికారుల సమావేశం



సమావేశమైన అధికారులు

పెగడపల్లి: పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ)పై మండల స్థాయి అధికారులతో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్, వైద్యాధికారి నరేశ్, ట్రాన్స్‌కో ఏఈ వెంకట్‌రెడ్డి, ఏవో అనిల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభద్ర, ఏపీవో అనిల్‌కుమార్, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.95వేలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

పెగడపల్లి: మండలకేంద్రంలోని రాజన్న ఆలయం హుండీ ఆదాయాన్ని మంగళవారం సిబ్బంది లెక్కించారు. రూ.95వేల ఆదాయం సమకూరినట్లు ఆలయ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్ తెలిపారు. మాజీ సర్పంచి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామచంద్రం, కోశాధికారి గోపికృష్ణ, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, అర్చకులు శ్రీనివాస్‌శర్మ, సభ్యులు సత్తయ్య, శ్రీనివాస్, మల్లికార్జున్, భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆఫీసు ఉన్నట్లా.. లేనట్లా..?

జగిత్యాల: జిల్లా కేంద్రం పెద్ద మున్సిపాలిటీ అయినప్పటికీ అధికారులు సక్రమంగా ఉండకపోవడంతో మున్సిపాలిటీ ఒకటుందన్నది ప్రజలు మరిచిపోతున్నారని జిల్లా కలెక్టర్‌కు 35వ వార్డు మాజీ కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ లేఖ రాశారు. మున్సిపాలిటీలో కమిషనర్‌తో పాటు సిబ్బంది ఎక్కడ పనిచేస్తున్నారో తెలియని పరిస్థితి ఉందని, మూమెంట్ రిజిస్టర్ ఉండదని, ఉన్నా రాయరని ఆరోపించారు. ప్రజల సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారు. కమిషనర్ ఉన్నారన్న విషయం తెలియకుండా చాంబర్‌కు తాళం వేసుకుంటున్నారని ఆరోపించారు. బల్దియాలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, ఉద్యోగులపై ఆరోపణలు వచ్చినా ఇప్పటి వరకు పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఇప్పటికైనా స్పందించి బల్దియాలో గాడిలో పెట్టాలని కోరారు.

ప్రత్యామ్నాయం లేక పాట్లు

- జగ్గాసాగర్ వద్ద ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మాణ పనులు
- భారీ వాహనాల రాకపోకలకు బ్రేక్
- వారం రోజులుగా ఆర్టీసీ బస్సు నిలిపివేత
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



జగ్గా సాగర్‌లో నిర్మిస్తున్న కల్వర్టు

మెట్‌పల్లి రూరల్: నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు జరిగే ఓ రహదారిపై జరుగుతున్న కల్వర్టు పనుల విషయంలో అధికారుల నిర్లక్ష్యంతో సమీప గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లోని ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న ఓ కల్వర్టు పనుల విషయంలో అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనుల చేపట్టే ముందు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పైపుల స్థానంలో కల్వర్టు పనులు..

మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో 5,6,7,8 వార్డుల్లోని మురికి కాల్వలు గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన గల మెయిన్ డ్రైయినేజీలో కలుస్తాయి. అయితే మురికికాల్వలకు మెయిన్ డ్రైనేజీకి అనుసంధానంగా గతంలో బీటీ రహదారి వేసే సమయంలో మిషన్ భగీరథ పనులు చేపట్టిన ఎజెన్సీకి సంబంధించిన పైపులను వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ రహదారి నిర్మించేటప్పుడు మిషన్ భగీరథ పైపులు వేయడమే ఇప్పుడు సమస్యగా మారింది. భగీరథ పనులు చేపట్టినప్పుడు కొన్ని పైపులు మిగిలిపోయాయని, వాటన్నంటినీ గ్రామాల్లోని ఓ చోట ఉంచితే చోరీకి గురయ్యాయని, మరికొన్ని గ్రామాల్లో అవసరాలకు వాడుకున్నారని సంబంధిత ఎజెన్సీ ప్రతినిధులు మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో, మైకుల్లో చెప్పించారు. మాయమైన పైపులను పలుచోట్ల ఎజెన్సీ ప్రతినిధులే గుర్తించారు. వాటన్నింటినీ ప్రస్తుతం బయటికీ తీయిస్తున్నారు. జగ్గాసాగర్‌లో కూడా వారం రోజుల కిందట పైపులను తీసివేయించారు. దీంతో తీసివేసిన పైపుల స్థానంలో కల్వర్టు నిర్మించాలని నిర్ణయించి పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయ్యేందుకు మరో 10 నుంచి 20 రోజుల వరకు సమయం పట్టే అవకాశం ఉంది.

ప్రత్యామ్నాయ రహదారి లేక ఇబ్బందులు..

ప్రధాన రహదారిపై జరుగుతున్న పనుల కారణంగా వాహనాదారులు,పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మీదుగానే రామలచ్చక్కపేట, ఆత్మనగర్, ఏడీబీ తండా, ఆత్మకూర్, పాటిమీదితండా, కొండ్రికర్లతో పాటు తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే గ్రామంలోని చిన్న చిన్న వీధుల గుండా ద్విచక్రవాహనాలు,ఆటోలు,జీపులు నానా తంటాలు పడుతూ వెళ్తున్నప్పటికీ భారీ వాహనాలకు వెళ్లేందుకు వీలులేదు. మరోవైపు ఈ ప్రాంతానికి ఆర్టీసీ బస్సు రాకపోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాగే విద్యాసంస్థల బస్సులు కూడా వెళ్లలేకపోతున్నాయి. దీంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. ఆదివారం రామలచ్చక్కపేట శివారులో రెండు ద్విచక్రవాహనాలకు జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, సరైన సమయానికి అంబులెన్స్ చేరుకోలేకపోయింది. అధికారుల నిర్లక్ష్యంతో తాము తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కథలాపూర్‌లో పుట్టకు పాలు పోస్తున్న మహిళలు



జగిత్యాలలో పూజలు చేస్తున్న మహిళలు



ధర్మపురిలో..



రాయికల్‌లో పూజలు చేస్తున్న మహిళలు



పొరండ్లలో భీమన్నదేవాలయం సమీపంలో..

నాగుల పంచమి వేడుకలు

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్/ధర్మపురి/రాయికల్/పెగడపల్లి/కథలాపూర్/మల్లాపూర్/మేడిపల్లి/ఇబ్రహీంపట్నం: నాగుల పంచమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు ఆలయాల్లో పూజలు చేసి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సంఘం సభ్యులు

కొడిమ్యాల: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న అంబేడ్కర్ సంఘ భవనానికి చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ చొరవతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ. 9.5 లక్షల నిధులు మంజూరు చేసి ప్రొసీడింగ్ పత్రాన్ని కలెక్టర్ చేతుల మీదుగా సంఘ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్మన్ మహేశ్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పర్లపెల్లి ప్రసాద్,మోహన్, శంకర్, చిరంజీవి,అజయ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో 2.26 లక్షల పెన్షన్లు పంపిణీ

జగిత్యాలరూరల్: జిల్లాలో ఆసరా, బీడీ కార్మిక, వృద్ధాప్య, వితంతు, గీత కార్మిక, చేనేత, వికలాంగ తదితర 2.26 లక్షల పెన్షన్లు నెలనెలా పంపిణీ చేస్తున్నట్లు డీఆర్డీఏ పీడీ రఘువరన్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో మంగళవారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి పోస్టాఫీసు ద్వారా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రానున్న రోజుల్లో పోస్టాఫీసు నుంచి ముఖ గుర్తింపుతో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, జిల్లా డీపీఎం నాగేశ్వర్‌రావు, మండల ఏపీఎం గంగాదర్, ఏపీవో గంగలక్ష్మణ్, కార్యదర్శి రాజేశ్, సీసీలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గొల్లపల్లి: చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన కసాడి బుచ్చయ్య(57) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బుచ్చయ్య అనారోగ్యంతో భాదపడుతూ ఈ నెల 20న గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య పోచవ్వ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

ఇంట్లో నగదు చోరీ

గొల్లపల్లి: మండలంలోని అగ్గిమలకు చెందిన మల్లేశ్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం చోరీకి పాల్పడ్డారు. రూ.లక్ష ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

సమాచారం

దరఖాస్తులు ఆహ్వానం

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ నర్సింగ్ సబ్జెక్ట్ బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ శోభారాణి మంగళవారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆగస్టు 2 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కేజీబీవీల్లో నేడు స్పాట్ అడ్మిషన్లు

మల్లాపూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరంతో పాటు 6వ తరగతి విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి(ఎస్‌వో) శ్రీలత తెలిపారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఆరో తరగతి నుంచిఇంటర్మీడియట్ వరకు మిగులు సీట్లలో విద్యార్థులు చేరుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు.

కథలాపూర్: కథలాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్‌లో బాలికలు చేరడానికి ఈనెల 30, 31 తేదిల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రత్యేకాధికారి లావణ్య మంగళవారం తెలిపారు. ఫస్టియర్‌లో కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరడానికి అవకాశముందన్నారు.

ధర్మపురి: ప్రభుత్వ కళాశాలలో సీట్ల భర్తీ కోసం ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మగ్గిడి (గొల్లపెల్లి) తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న ఇంటర్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరం సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని టౌన్-3 సెక్షన్ పరిధిలోని తీన్‌ఖని చౌరస్తా, పెద్ద మసీదు, కటికెవాడ, మంచి నీళ్ల బావి, తెనుగువాడ, దగ్గులమ్మ గుడి, ఉస్మాన్ పురా, మహబూబ్ పురా, రహమత్ పురా, జెండా మహిళా, ప్యారాబాయి, గోరే మియా, ఖిలాగడ్డ ఏరియాలో బుధవారం ఉదయం 10.00 గంటల నుంచి 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ డీఈఏ. రాజిరెడ్డి తెలిపారు.

కిక్ బాక్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాల: సౌత్‌జోన్ ఖేల్ ఇండియా పోటీలకు జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. జులై 26 న ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఉమెన్స్ కిక్ బాక్సింగ్ అండర్-15లో ప్రతిభ చూపించి సౌత్‌జోన్ ఖేల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, మాస్టర్ ఆంజనేయులు తదితరులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

రాయికల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాయికల్ పట్టణంలోని 12వ వార్డులో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూల చెట్లు, గులాబీ, మందారం, పండ్ల చెట్లు, ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మేనేజర్ వెంకట్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో తిరు నక్షత్ర వేడుకలు

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన శ్రీ వేంకటేశ్వర ఆలయంలో గోదాదేవి తిరు నక్షత్ర వేడుకలు సోమవారం రాత్రి వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. రాత్రి దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎతిరాజం నర్సయ్య, అర్చకుడు బీర్నంది నర్సింహాచారి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పదవులు బాధ్యతను పెంచుతాయి

మెట్‌పల్లి: పదవులు మరింత బాధ్యతను పెంచుతాయని సీనియర్ సివిల్ మెజిస్ట్రేట్ నాగేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ తెలంగాణ జడ్జెస్ అసోసియేషన్‌లో ఈసీ మెంబర్‌గా నియమితులు కాగా, మంగళవారం ఆయనను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కంతి మోహన్‌రెడ్డితో పాటు పలువురు న్యాయవాదులు ఉన్నారు.

ఘనంగా ఉత్తర నక్షత్ర వేడుకలు



పూజలు చేస్తున్న భక్తులు

కోరుట్ల రూరల్/ మెట్‌పల్లి: పట్టణ శివారులోని అయ్యప్ప స్వామి ఆలయం, మెట్‌పల్లిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్ర వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు , అభిషేకాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శివునికి ప్రీతికరమైన గిరి ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఆలయ అర్చకుడు పాలెపు జయరామ శర్మ, మెట్‌పల్లి ఆలయ అధ్యక్షుడు దొమ్మాటి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు అంకతి భరత్‌కుమార్, బండారి మారుతి, శివభక్తులు పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని బొమ్మెన ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో మురికినీరు, వర్షపునీరు నిల్వలు పేరుకుపోవడంతో దోమల బెడద, చెడు వాసన వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు, వార్డు ప్రజలు అంటున్నారు. ఈ వర్షాకాలంలో నీటి నిల్వల ప్రభావం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందని వాపోతున్నారు. అధికారులు స్పందించి మురికినీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఎంపీవో, కథలాపూర్ సెల్ నంబర్ : 9640807073

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లబ్ స్థలం పరిశీలన

మెట్‌పల్లి: పట్టణంలోని రాంనగర్‌లో ఉన్న మెట్‌పల్లి క్లబ్ స్థలాన్ని మంగళవారం జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా క్లబ్‌లో ఎంపీ, ఎమ్మెల్యేల నిధుల భాగస్వామ్యంతో నిర్మించిన కట్టడాలను నిబంధనలకు విరుద్ధంగా తొలగించారని పలువురు ఆయన దృష్టికి తీసుకపోయారు. అంతకుముందు స్థానిక మండల పరిషత్ సమావేశంలో ఆయన రెండు వర్గాలతో సమావేశం ఏర్పాటు చేయగా, దీనికి క్లబ్ ముఖ్యులు గైర్హాజరయ్యారు. క్లబ్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను బుధవారం అందజేస్తామని అధ్యక్షుడు ఫోన్‌లో సమాచారమందించినట్లు డీసీవో ×సాక్షి¥కి తెలిపారు.

మహా గర్జన విజయవంతం చేయాలి

ధర్మపురి: ఆగస్టు 6 వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ మహా గర్జన సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి చిరు లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆసరా పింఛన్ల పెంపు కోసం వృద్ధుల వికలాంగుల సదస్సుకు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, నాయకులు సతీష్,లక్ష్మణ్, రాయమల్లయ్య, కిషన్, మహేశ్, గంగారాం, రవికుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి ఏపీఎంగా అశోక్

మెట్‌పల్లి రూరల్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు మోక్షం లభించింది. మెట్‌పల్లి ఏపీఎం విమోచన గొల్లపల్లికి బదిలీ అయ్యారు. మేడిపల్లి ఏపీఎం అశోక్‌కు మెట్‌పల్లిలో పోస్టింగ్ ఇచ్చారు. బదిలీ అయిన అధికారులు ఈ నెల ఆఖరుకు రిలీవ్ అయి, ఆగస్టు 1న కేటాయించిన స్థానాల్లో రిపోర్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సెర్ప్ వర్గాల ద్వారా తెలిసింది.

కేటీఆర్‌ను కలిసిన జెడ్పీ మాజీ చైర్ పర్సన్

జగిత్యాలజోన్: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై ఇరువురు నాయకులు చర్చించారు. స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ గెలుపొందేలా వ్యూహారచన చేయాలని కేటీఆర్ సూచించినట్లు మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షలు మంజూరు

కోరుట్ల రూరల్: మండలంలోని గుమ్లాపూర్ శివారులోని గుట్టపై శ్రీ వేంకటేశ్వర ఆలయ ఉత్తర ద్వార అభివృద్ధి పనులకు రూ. 3 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మంగళవారం మంజూరు పత్రాలను శ్రీ వేంకటేశ్వర సేవా సమితి సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొంతం రాజం, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్,సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

వెల్గటూర్: ఈనెల 17న హత్యకు గురైన సల్లూరి మల్లేశ్ కుటుంబానికి న్యాయం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు మంగళవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. మల్లేశ్ హత్యపై అనుమానాలు ఉన్నాయని, అతడిపై నమోదైన ఆరు కేసుల్లో కోర్టు దోషిగా నిర్ధారించలేదని, హత్యాయత్నం చేసి అట్రాసిటీ కేసులో జైలుకు వెళ్లి వచ్చినందుకు రౌడీషీట్ ఓపెన్ చేయడం కక్షపూరితంగానే జరిగిందన్నారు. హత్యలో ఆరుగురి ప్రమేయం ఉన్నా.. ముగ్గురిని మాత్రమే అరెస్టు చేశారని తెలిపారు. మల్లేశ్ హత్య కేసును విచారించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభినవ్, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.

రెండు రోజుల్లో 40 టన్నుల యూరియా

ఇబ్రహీంపట్నం: రెండు రోజుల్లో 40 టన్నుల యూరియా వస్తుందని ఇందులో ఇబ్రహీంపట్నం సొసైటీకి 20 టన్నులు, ఆగ్రోస్ సంస్థకు 20 టన్నులు యూరియా వస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ×యూరియా కోసం రైతుల తిప్పలు¥ అనే కథనం మంగళవారం రావడంతో ఇబ్రహీంపట్నంలోని ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీవో)లో రికార్డులను , ఈపాస్ యంత్రాన్ని తనిఖీ చేశారు. మండలంలో యూరియా కొరత లేదని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో సీఈవో శ్రీధర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

రాయికల్: పట్టణంలోని 6, 10, 12 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ మనోహర్‌గౌడ్, మేనేజర్ వెంకటి, హౌసింగ్ ఏఈ తిరుమల పాల్గొన్నారు.

స్థల పరిశీలన

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాల అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.49 లక్షలు మంజూరు చేసింది. దీంతో పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం స్థలాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో 3 అదనపు తరగతి గదులకు రూ.33 లక్షలు, మంచినీరు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరైనట్లు కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు ఎంబేరి సత్యనారాయణ, సోగ్రాబి, ఏఆర్ అక్బర్, జిందం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ రోడ్డు పనులు చేపడతాం

కథలాపూర్: వర్షాలు తగ్గుముఖం పట్టాక మోడల్ స్కూల్ రోడ్డు పనులను చేపడుతామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు అన్నారు. మంగళవారం కథలాపూర్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికే అటువైపు కన్నెత్తి చూడని నాయకులు రోడ్డు పనులపై మాట్లాడుతున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు ఎం.డీ అజీమ్, వెలిచాల సత్యనారాయణ, ఎం.డీ రేహన్, వంశీ, శంకర్, రాజు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

మేడిపల్లి: భీమారం మండలంలోని దేశాయిపేట, మోత్కురావుపేట గ్రామాల్లో ఎస్సై శ్రీధర్ రెడ్డి మంగళవారం ప్రజలతో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో ప్రముఖ పాత్ర వహిస్తాయని, యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైన వాళ్లు వెంటనే 1930కి కాల్ చేసి కంప్లైంట్ ఇవ్వాలని, మైనర్లు డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు.